క్లుప్తంగా

నెహ్రూ అవార్డు ప్రదానం



భాస్కరరావుకు అవార్డు అందజేస్తున్న సీఎండీ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలోని ఫౌండ్రీ సెక్షన్ సీనియర్ ఫోర్‌మన్ సీహెచ్.భాస్కరరావుకు జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసే ఉద్యోగులకు ఏటా జేఎన్ అవార్డులను అందజేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్ చేతుల మీదుగా భాస్కరరావు అవార్డు అందుకున్నారు. డైరెక్టర్లు డి.కె.మొహంతి, బాగ్చీ, ఎస్.సి.పాండే తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పెదగంట్యాడలో ప్రచారం చేస్తున్న సభ్యులు

పెదగంట్యాడ: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన త్రైత సిద్ధాంత భగద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీతపై పెదగంట్యాడలో సోమ వారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాఘమాసంలో రథసప్తమి, మాఘపూర్ణిమ, శివరాత్రి పండ గల ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమంలో అప్పారావు, రమేష్, రమణ, అరుణకుమార్, విజయ్, గణేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ విప్స్ టీమ్ లీడర్‌కు అభినందనలు



విప్స్ లీడర్ భానును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్(విప్స్) లీడర్, ఉక్కు ఎల్ అండ్ డీసీ జీఎం ఎస్.భానును స్టీల్‌ప్లాంట్ నాయకులు అభినందించారు. స్టీల్‌ప్లాంట్ విప్స్ ఇటీవల జాతీయ స్థాయిలో బెస్ట్ ఎంటర్‌ప్రైజ్‌గా అవార్డు అందుకున్న సందర్భంగా పలు సంఘాల నాయకులు సోమవారం ఆమెను కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె విప్స్ కార్యక్రమాల గురించి వారికి వివరించారు. విప్స్‌కు యాజమాన్యం నుంచి అందుతున్న మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బి.జగ్జీవన్‌రామ్, కొమ్ము ప్రసాదరావు, బి.డేవిడ్, బి.ఎ.స్వామి, ఎస్.వి.సత్యనారాయణ, జి.సురేష్, ఎన్.సువర్ణరాజు, పి.సత్యనారాయణ, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు చర్యలు

మహారాణిపేట: వచ్చే ఏడాది నాటికి దేశంలో టీబీని పూర్తిగా నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చాంబర్‌లో సోమవారం టీబీపై సమావేశం నిర్వహించారు. జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ టీబీ నివారణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికను రూపొందించాయన్నారు. దీనిని అన్ని శాఖల అధికారులు అమలు చేయాలన్నారు. చింతల అగ్రహారం, గొరపల్లి, సరిపల్లి, ఎస్‌ఆర్ పురం తదితర గ్రామాల్లో టీబీ నివారణపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా టీ.బీ.నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా పంచాయతీ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యులు రామారావు, రమేష్ హాజరయ్యారు.

ఆపద వేళ అండగా సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 47 మందికి రూ.39.13 లక్షలు అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్త ఉరుకూటి చందు

పెదగంట్యాడ: ఆపద వేళ పేదలకు సీఎం సహాయ నిధి అండగా ఉంటోందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. అనారోగ్యంతో సతమతమవుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. స్థానిక బీసీ రోడ్డు టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 47 మందికి రూ.39.13 లక్షలు సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వాటితో పాటు పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కూడా ఆర్థిక సాయం అందించడం ఎన్నో కుటుంబాలకు ఊరట నిస్తోందన్నారు. చెక్కులు తీసుకున్న వారిలో గాజువాకకు చెందిన బొడ్డేటి రమాదేవి, అగనంపూడికి చెందిన ఎస్.మాళి, దువ్వాడకు చెందిన జోగ తాతారావు, గాజువాక చెందిన గొడవర్తి లక్ష్మి, వుడాకాలనీకి చెందిన రాజా అలెగ్జాండర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు కోమటి శ్రీనివాసరావు, రోజారాణి, ధర్మాల శ్రీనివాసరావు, రాజాన వెంకటరావు, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకర నారాయణ, సంపంగి ఈశ్వరరావు, బోగాది సన్నీ, పూర్ణనందశర్మ, భూపతిరాజు శ్రీనివాస్, యువశ్రీ, ప్రమీల, గొందేశి శ్రీనివాసరెడ్డి, గొందేశి ప్రభాకర్ రెడ్డి, బ్రహ్మయ్య, గొందేశి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా నీరాజనం

65వ వార్డులో చందు పాదయాత్రకు సాదర స్వాగతం



పాదయాత్రలో ప్రజలకు చందు అభివాదం

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) పాదయాత్రకు 65వ వార్డులో అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. కాకతీయ కూడలి వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసిన చందు పాదయాత్రను ప్రారంభించారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర కాకతీయ కూడలి, భానోజీతోట, భానోజీ కాలనీ, అశోక్‌నగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లో ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన ఎన్నికల శంఖారావం సభకు స్పందన కరువైందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారని, ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయవద్దని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా చూడాలని ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారన్నారు. బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తుంటే బీజేపీ మిత్రపక్షం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, 25 ఎంపీ స్థానాలను కూడా కైవసం చేసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, వాసు, కటికల కల్పన, ఉమాదేవి, మంత్రి మంజుల, పప్పల ఆదిలక్ష్మి, దేముడు, అప్పలరాజు, రామస్వామి, రమణ, షాజన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలో స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వరంగ సంస్థల వల్లే ఆర్థికాభివృద్ధి మెరుగుపడిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. అటువంటి సంస్థలను కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1103వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చిన్నారుల పెద్ద మనసు

- అనాథల చదువుకు విద్యార్థుల ఆసరా
- పాకెట్ మనీ కూడబెట్టి రూ.10వేలు అందజేత



స్ఫూర్తి సంస్థ నిర్వాహకుడికి విరాళం అందిస్తున్న విద్యార్థులు

మల్కాపురం: సాయం చేయాలనే సంకల్పం ఉండాలే గానీ, వయసుతో పని లేదని రుజువు చేశారు ఆ విద్యార్థులు. తల్లిదండ్రులు పాకెట్‌మనీగా ఇచ్చిన డబ్బులను పోగేసి అనాథ పిల్లల చదువు కోసం సాయమందించి, పెద్దమనసును చాటుకున్నారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు అనాథల చదువుకు ఏదైనా సాయం చేయాలనే ఆలోచన వచ్చింది. దీంతో ప్రతీరోజూ తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని గతేడాది నవంబర్ నుంచి ఈ నెల 19వ తేదీ వరకు కిడ్డీ బ్యాంక్ (డిబ్బీ)లో దాచుకున్నారు. ఆ మొత్తం రూ.10వేలు అవడంతో, సోమవారం గాజువాకలోని స్ఫూర్తి అనాథాశ్రమంలోని బాలల చదువు కోసం సాయంగా వినియోగించాలని కోరుతూ సంస్థ అధినేత రాజేష్‌కు అందజేశారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు, ఉపాధ్యాయిని అరుణ అభినందించారు.

పాఠశాల కిటికీ గ్రిల్ పడి విద్యార్థికి గాయాలు



ఎంఈవో పద్మావతితో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో ఉన్న రవీంద్రభారతి పాఠశాల కిటికీ గ్రిల్ జారిపడి ఆదివారం ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచగా మంగళవారం వెలుగుచూసింది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన వివేక్ ఇక్కడ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అతడిని చూడడానికి వివేక్ అక్క నందిని కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వచ్చింది. ఆమె పాఠశాల నుంచి తిరిగి వెళ్తుండగా పాఠశాల నాలుగో ఫ్లోర్‌లో ఉన్న కిటికీ గ్రిల్ ఊడి నందిని తలపై పడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో సంగివలసలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ విషయం తెలుసుకున్న నందిని తండ్రి భాస్కరరావు, మరికొంత మంది పాఠశాలకు చేరుకొని సంఘటనపై పాఠశాల యాజమాన్యా న్ని నిలదీశారు. స్థానిక పోలీసులకు ఆస్పత్రి వర్గాల వారు విచారణ నిమిత్తం సమాచారం అందించారు.

ఎంఈవో విచారణ

ఆనందపురం ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి మంగళవారం పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. గ్రిల్ ఊడిపడిన కిటికీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో ఫ్లోర్‌లో నిర్వహిస్తున్న హాస్టల్ గదులు కిటికీల గ్రిల్స్ అన్నీ బలహీనంగా ఉన్నాయని వెల్లడించారు. కిటికీలకు ఉన్న అన్ని గ్రిల్స్‌ను సరిచేసేంత వరకూ ఆ ఫ్లోర్‌లో హాస్టల్ నిర్వహించరాదని ఆదేశాలిచ్చారు. సంఘటనపై శాఖాపరమైన విచారణ జరిపి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

అకారణంగా గాయాలు పాలైన విద్యార్థి కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యం ఆదుకోవాలని ఏబీవీపీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల నిర్వహిస్తున్న గదులు అస్తవ్యస్తంగా ఉన్నాయని భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటన విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం ఉందని నందిని కుటుంబ సభ్యులు మాత్రం కేసు అక్కరలేదని తెలిపి నందినిని సొంత గ్రామానికి తీసుకొని వెళ్లిపోయినట్టు తెలిపారు.

జెడ్సీ సన్యాసినాయుడు బాధ్యతల స్వీకరణ



గాజువాక : జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌గా బి.సన్యాసినాయుడు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఆయన జీవీఎంసీ జోన్‌-4 కమిషనర్‌గా పని చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల నలుగురు జోనల్ కమిషనర్లను మార్చుతూ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలు జారీ చేయడంతో సన్యాసినాయుడు గాజువాక జోనల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ప్రస్తుత జోనల్ కమిషనర్ ప్రసాదరావు జోన్‌-4కు బదిలీపై వెళ్లారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం: పీఎం విశ్వకర్మ పథకాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. ఈ పథకంపై 69వ వార్డు నాతయ్యపాలెంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 18 రకాల చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి శిక్షణ ఇస్తారని, శిక్షణ కాలంలో స్టైపెండ్ చెల్లిస్తారని చెప్పారు. శిక్షణ అనంతరం 1 లక్ష రూపాయలు రుణం అందిస్తారని తెలియజేశారు. పంతులుగారి మేడ వద్ద తమ కార్యాలయంలో నిరుద్యోగులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.రోహిణి, మండల అధ్యక్షుడు కె.అప్పలరాజు, రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు, కళాశాల సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. సంస్థ నిర్వహించిన ×రహదారి భద్రత పౌరుల బాధ్యత¤ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రహదారి భద్రతపై విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీల చేతుల మీదుగా విజేతలైన ఉషశ్రీ, శ్రావ్య, చంద్రిక, సంతోషి, నందిని, అఖిల, దియాపాల్‌కు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి, అధ్యాపక సిబ్బంది, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కనులపండువగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయం గా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

మద్దిలపాలెం : విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ద్వారకా జోన్ క్రైమ్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్స్, పోక్సో చట్టాలపై మద్దిలపాలెంలోని వీఎస్ కృష్ణా కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసులో నేరాలకు పాల్పడి ఎంతో మంది విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కోపం, ఉద్రేకం, ఇతర విద్యార్థులకు భిన్నంగా ఉండాలనే ఆలోచనలతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ కేసుల్లో చిక్కుకుంటున్నారని చెప్పారు. పెరుగుతున్న టెక్నాలజీని వినియోగించి సోషల్ మీడియాలో పక్కవారిపై అవమానకర పోస్టులు పెడుతూ కష్టాలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. సైబర్ క్రైమ్ చట్టాలలో భాగంగా శిక్షలకు గురవుతున్నారన్నారు. విద్యార్థినుల పట్ల వికృత చేష్టలకు దిగుతూ పోక్సో చట్టాల ప్రకారం శిక్షలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేరాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. నేరాలకు మాదకద్రవ్యాల వినియోగం కూడా ప్రధానమనే విషయాన్ని గుర్తించాలన్నారు. నేర సంస్కృతికి పూర్తిగా దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదిగేందుకు శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామ్‌ధాస్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ, గ్రామపెద్దలు



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ డొంకాడ గ్రామదేవత దుర్గమాంబ అమ్మవారి ఆలయ 21వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. విశేష పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి దుర్గమాంబ లలితాదేవి సహస్రనామ పారాయణం చేశారు. గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం విశేష అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాధరావు, బొబ్బరి అప్పారావు, దాసరి సన్యాసిరావు, కరణం శ్రీను, అట్టా అప్పారావు, బల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో కలశాలతో పాల్గొన్న మహిళలు



ప్రసన్న వేంకటేశ్వరుని ఉత్సవ విగ్రహాలతో గిరి ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరుడి గిరి ప్రదక్షిణను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ వేంకటేశ్వర మరియు వినాయక స్వామి వార్ల ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గిరి ప్రదక్షిణ చేశారు. మహిళలు కలశాలతో పాల్గొన్నారు. దారి పొడవునా కోలాటాలతో సందడిగా ప్రదక్షిణ సాగింది. మంగళవారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రసన్న వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకం, ప్రసన్న గిరిపై కొలువైయున్న దాసాంజనేయ స్వామికి క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి ఎ.జగన్నాథరావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ గంద్రెడ్డి రామునాయుడు, అచ్చిలి నాయుడు, పెట్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేత అండిబోయినకు సత్కారం



అప్పారావును సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల స్వర్ణ పతక విజేత అండిబోయిన అప్పారావును వైఎస్సార్‌టీయూసీ నాయకులు సత్కరించారు. గోవాకు చెందిన సూపర్ మాస్టర్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోవాలోని జీఎంసీ స్టేడియంలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ పవర్ లిఫ్టింగ్ స్టీల్‌ప్లాంట్ బీఎఫ్ విభాగం జనరల్ ఫోర్‌మన్ అండిబోయిన అప్పారావు బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా అప్పారావును సోమవారం స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మస్తానప్ప నేతృత్వంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, ఎన్నేటి రమణ, ఎస్. శ్రీనివాస్, జి. నూకరాజు, డి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా షిర్డీ సాయి ఆలయ వార్షిక వేడుక



పూజల్లో పాల్గొన్న ద్రోణంరాజు శ్రీవత్సవ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయం 24వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున కాకడ హారతితో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం పంచామృతాభిషేకం, పుణ్యాహవచనం, మండపారాధన, సాయి మూల మంత్రం, హోమం భక్తిశ్రద్ధలతో జరిపించారు. అగనంపూడి బొర్రమాంబ పారాయణ సేవా సమితి బృందం పారాయణ చేశారు. అనంతరం అఖండ భజన కార్యక్రమం, సాయి చాలీసా, హనుమాన్ చాలీసా, విష్ణు, లలిత సహస్ర నామాలను పఠించారు. కార్యక్రమంలో అఖిల పక్షాల నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ, కె.చరణ్, తిప్పల దేవన్ రెడ్డి, శ్రీకాంత్, దొరబాబు, నారాయణరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, పి.రామారావు, జి.శంభుడు తదితరులు పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి కొయ్య అప్పలనర్సమ్మ తరపున భాస్కర్‌రెడ్డి, కొయ్య రామకృష్ణారెడ్డి దంపతులు రూ.10 వేలు అందించారు.

జిల్లా స్థాయి విండ్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

పెదగంట్యాడ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు పాత గంగవరం గ్రామంలోని మాధవస్వామి తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని గంగవరం గ్రామంలో ఎలెవెన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విండ్ బాల్ క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మాఘపౌర్ణమిని పురస్కరించుకుని మీ సేవా మైదానంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 12 జట్లు తలపడనున్నట్లు చెప్పారు. పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతిగా అందజేస్తామన్నారు.

అలరించిన సంగీత విభావరి



ప్రముఖులను సత్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: స్టార్స్ కళాంజలి ఈవెంట్స్ వెంకట్ అండ్ టీం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా గాయకుడు పూతి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గాయనీ గాయకులు పాల్గొని పలు గీతాలు మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్కార కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, టీడీపీ నాయకుడు ఆడారి కిషోర్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నా తిరుమలరావు, స్టార్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు అమరేంద్ర, రాయుడు కుమార్, బెల్లం జైకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో దర్శకుడు వినోద్, ఏపీ మా మాజీ అధ్యక్షుడు కృష్ణకిషోర్, పి.శ్యాంకుమార్, రమేష్ యాదవ్, విజయ్‌రమణి పాల్గొన్నారు.